# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 02 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## ములుగు గిరిజన యూనివర్సిటీకి 211 ఎకరాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ములుగు గిరిజన యూనివర్సిటీకి అవసరమైన భూమిని కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమ్మక్క సారలక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పేరుతో ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే.ఈ మేరకు గత నెల 14న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ క్రమంలో గిరిజన యూనివర్సిటీకి 211.26 ఎకరాలను కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది.ములుగు గ్రామంలోని సర్వే నెంబర్ 837లో 211 ఎకరాలను కేటాయించింది. ఈ భూమికి ఎకరాకు రూ.3,37,500 ధర ఉండగా, మొత్తం ధర రూ.10,58,31,250 కోట్లుగా తేల్చారు. ఈ మేరకు సదరు భూమిని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశం ఇచ్చింది.

# మహోన్నతంగా మహాత్మ ఘాట్



- ప్రపంచంలో ఎత్తయిన గాంధీ విగ్రహం
- ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమం
- నమూనాలు డిజైన్లపై చర్చలు
- విస్తృత సంప్రదింపులు

**బలగం టీవీ, హైదరాబాద్**

మూసీ తీరంలోని బాపూఘాట్ ను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బాపూఘాట్ వద్ద బ్రిడ్జి కమ్ బ్యారేజీతో పాటు గాంధీ ఐడియాలజీ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. బాపూఘాట్ ను సోదర సౌభ్రాతృత్వానికి సంకేతంగా, ప్రపంచ శాంతికి చిహ్నంగా అటు అధ్యాత్మికంగా, ఇటు విద్యాబోధన కేంద్రంగా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రపంచంలోని అందరి దృష్టిని ఆకర్షించేలా బాపూఘాట్ ను అధునాతనంగా.. అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని తన ఆలోచనలను ఇటీవలే అధికారులతో పంచుకున్నారు. అటు ఉస్మాన్? సాగర్?, ఇటు హిమాయత్ సాగర్ నుంచి వచ్చే మూసీ, ఈసా నదుల సంగమ ప్రాంతంలో బాపూఘాట్ ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని గాంధీ సరోవర్ గా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. గాంధీ బోధనలు, ఆయన ఆచరణ, ఆశయాలను ప్రతిబింబించేలా ఐడియాలజీ సెంటర్ తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ కోర్సులు నిర్వహించే ఎడ్యుకేషన్ హబ్ గా గాంధీ ఆశ్రమం కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

### సైకిల్‌తో యువకుడు స్టంట్.. చివరికి ఏమైందంటే..! వీడియో వైరల్

మూసీ నదీ తీరంలో సుందరమైన విశాల ప్రాంతం కావటంతో.. బాపూఘాట్ లో ఎలాంటి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి.. దీన్ని ఏ ఆకృతిలో తయారు చేయాలి.. ఎంత ఎత్తుతో తయారు చేయించాలి.. డిజైన్లు ఎలా ఉండాలి.. అనేది ఆయా రంగాల నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించ నున్నారు. దేశ విదేశాల్లో ఎక్కడెక్కడ గాంధీ విగ్రహాలున్నాయి.. ఎక్కడెక్కడ గాంధీ ఆశ్రమాలున్నాయి.. ఏయే నమూనాలో ఉన్నాయి.. వెంటనే అధ్యయనం చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా బాపూఘాట్ లో ఎలాంటి విగ్రహం పెట్టాలి%ౌ% మూసీ నదీ తీరంలో ఎంత ఎత్తున నిర్మించే అవకాశముంది%ౌ%. సాధ్యాసాధ్యాలన్నింటినీ ఆరా తీస్తున్నారు.

ప్రస్తుతం దేశంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాల్లో పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ఉన్న గాంధీ విగ్రహమే అత్యంత ఎత్తయింది. దీని ఎత్తు 72 అడుగులు. 2013లో దీన్ని ఏర్పాటు చేశారు. ఇది కాంస్యంతో తయారు చేశారు. ఇద్దరు చిన్నారులతో గాంధీ అప్యాయంగా ఉన్నట్లుగా ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ప్రపంచంలో వివిధ దేశాల్లోనూ గాంధీ విగ్రహాలున్నాయి. అమెరికాలోని టెక్సాస్లోని ఇర్వింగ్ లో మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద 8 అడుగుల కాంస్య విగ్రహముంది. ఇప్పటి వరకు భారత దేశం బయట ఉన్న అతి పెద్ద విగ్రహం ఇదే. గాంధీ దండి మార్చ్ కు నడుస్తున్న భంగిమలో ఈ విగ్రహముంటుంది. శాంతి, సామరస్యానికి ప్రతీకగా ఇది అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది.

2018లో గుజరాత్ లోని నర్మదా నదీ తీరంలో ఐక్యతా చిహ్నంగా సర్దార్ వల్లభబాయ్ పటేల్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 182 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలో అత్యంత ఎత్తయిన విగ్రహంగా దీన్ని నిర్మించారు. ఇప్పుడు హైదరాబాద్?లో అంతకంటే ఎత్తున గాంధీ విగ్రహం నిర్మించాలా..? పాట్నాలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి మించిన ఎత్తులో దీన్ని నిర్మించాలా? కూర్చొని ధ్యాన ముద్రలో ఉన్న భంగిమలో గాంధీ విగ్రహాన్ని తయారు చేయించాలా దండి మార్చ్ కు కదులుతున్నట్లుగా నిలబడి ఉండాలామరేదైనా నమూనా ఎంచుకోవాలా.. అనే విషయంలో విస్తృత స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరపాలని, అవసరమైతే అన్ని వర్గాల మేధావులు, అన్ని పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల సలహాలు సూచనలను స్వీకరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

ప్రపంచంలో అందరి మదిలో నిలిచేలా బాపూఘాట్‌లో మహాత్ముడి విగ్రహం ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో అసెంబ్లీ ఎదుట ఉన్న మహాత్మగాంధీ విగ్రహమే ఇప్పటివరకు తెలంగాణలో పెద్దది. ధ్యాన ముద్రలో ఉన్న ఈ గాంధీ విగ్రహం ఎత్తు 22 అడుగులు. మైలైఫ్ ఈజ్ మై మెసేజ్ అనే సందేశంతో కాంస్యంతో దీన్ని తయారు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1999లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈ విగ్రహాన్నిఆవిష్కరించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో బాపూఘాట్‌లో ఏర్పాటు చేయబోయే గాంధీ విగ్రహం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## రాష్ట్రంలో రూ.5,211 కోట్ల జీఎస్టీ వసూలు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రూ.5,211 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,815 కోట్ల జీఎస్టీ వసూలు అయ్యింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. 2024 అక్టోబర్ నెలకు సంబంధించి దేశవ్యాప్తంగా రూ.1.87 లక్షల కోట్లు జీఎస్టీ వసూలైందని, గతేడాది అక్టోబర్‌లో రూ.1,28,582 కోట్లు వసూళ్లయ్యాయని తెలిపింది. ఈ ఏడాది ఏకంగా 10.63 శాతం వసూళ్లు పెరిగాయని పేర్కొంది. తెలంగాణలో గతేడాది అక్టోబర్‌లో రూ.4,868 కోట్లు

వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.5,211 కోట్లు వసూలైందని, పెరుగుదల 7 శాతం నమోదైందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది అక్టోబర్ రూ.3,493 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.3,815 కోట్లు పెరిగిందని, పెరుగుదల 12 శాతం నమోదైందని తెలిపింది.

### తెలంగాణకు రూ.25,306 కోట్లు.. ఏపీకి రూ.19,171 కోట్లు

ఈ ఏడాది అక్టోబర్ వరకు ఎస్‌జీఎస్‌టీ నిధులు తెలంగాణకు రూ.25,306 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,171 కోట్లు ఇచ్చినట్టు తెలిపింది. తెలంగాణకు గతేడాది అక్టోబర్ వరకు రూ.23,478 కోట్లు ఇవ్వగా, ఈ ఏడాది 8 శాతం నిధులు పెరిగాయి. ఏపీకి గతేడాది అక్టోబర్ వరకు రూ.18,488 కోట్లు ఎస్‌జీఎస్‌టీ నిధులు ఇవ్వగా, ఈ ఏడాది నాలుగు శాతం నిధులు పెరిగాయి.

## ప్రజాక్షేత్రంలోకి వెళ్తా.. పాదయాత్ర చేస్తా



- మాజీ మంత్రి కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను ప్రజాక్షేత్రంలోకి వెళ్తానని.. పాదయాత్ర చేస్తానని సంచలన ప్రకటన చేశారు. దీపావళి పండుగ రోజు గురువారం సాయంత్రం పూట 'ఎక్స్'లో 'ఆస్క్ కేటీఆర్' పేరిట నెటిజన్ల నుంచి ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా.. రాజకీయంగా.. సమకాలీన పరిణామాలపై కేటీఆర్ స్పందించారు.దాదాపు గంటన్నరపాటు కేటీఆర్ ప్రశ్నోత్తరాలకు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపం. ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైంది' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన కొట్లాడడమే ప్రస్తుత బాధ్యత తమపై ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

పార్టీ కార్యకర్తలు అందరూ కోరుకుంటుండడంతో కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయి పాదయాత్రను నిర్వహిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం వంటి వాటిపై కేటీఆర్ స్పందించారు. 'కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకి మార్గదర్శకత్వం చేస్తున్నారు' అని వివరించారు. పార్టీ నేతలపై వేధింపులు.. అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. అయితే వీటికి భయపడేది లేదు' అని కేటీఆర్ హెచ్చరించారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. రేవంత్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ వెనక్కి పోతోందని తెలిపారు. ఐదు సంవత్సరాల కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు కాబట్టి దాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తన బావ మరిది ఇంట్లో జరిగిన దావత్‌పై పరోక్షంగా కేటీఆర్ స్పందించారు. 'మేము అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడు ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబసభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యా. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థం కాదు. ఈ విషయం అత్యంత బాధ కలిగిస్తుంది' అని కేటీఆర్ తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. అనేక అంశాలు రెండు పార్టీల నాయకులు కుమ్మక్కై పని చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను తప్పుతున్న కాంగ్రెస్ లాంటి పార్టీకి మహారాష్ట్ర ఎన్నికల్లో జాతీయ పార్టీలను ప్రజలు ఓటు వేయరాదని పిలుపునిచ్చారు. తమిళనాడు విజయ్ దళపతి ప్రారంభించిన రాజకీయ పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయపరమైన అంశాల పట్ల విభేదాలే తప్ప టీడీపీ, వైఎస్ఆర్సీపీ అగ్ర నాయకులందరితో వ్యక్తిగతంగా అనుబంధం ఉందని గుర్తుచేశారు.

## పత్తి కొనుగోళ్ల విషయంలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవీ, హైదరాబాద్**

వ్యవసాయ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు కోపరేటీవ్ మరియు మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పి.ఎ.సి.ఎస్ మరియు మార్కెటింగ్ యార్డులలో సంస్థాగతంగా చేపట్టాల్సిన చర్యల గురించి ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి రైతులకు మరింత సులభతరంగా, సమర్థవంతంగా సేవలు అందేలా రీ-ఆర్గనైజేషన్ చేసి, అవసరమున్న చోట కొత్త శాఖలు ఏర్పాటు మరియు సంఘాల పరిపుష్టికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డి.సి.సి.బి మరియు డి.సి.ఎమ్.ఎస్ లలో గతంలో జరిగిన అవకతవకలు అన్నింటిమీద శాఖాపరమైన విచారణను త్వరితగతిన పూర్తి చేసి, బాధ్యులపై చర్యలతో పాటు, సర్‌చార్జీలు ఆదేశాలు వెలువడిన చోట నిధుల రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు.

ఆధునిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాకు ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్ల ఆధీనంలో ఉన్న గోదాముల నిర్వహణ మరియు మరియు ఖాళీ స్థలాలలను వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే విధంగాచేసి మార్కెట్ల ఆదాయం పెంచి, ఆ నిధులను రైతులకు మరింత మెరుగుసేవలు అందించే విధంగా సౌకర్యాల కల్పనకి వినియోగించుకోవాలని కోరారు.

మార్కెట్ కు మరియు జిన్నింగ్ మిల్లులకు వచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేసేల ఏర్పాట్లు చేయాలని, జిల్లా అధికారులు, సెక్రటరీలు రైతులకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. వాట్స్ యాప్ సేవల (8897281111) ద్వారా వెయిటింగ్ టైమ్, పేమెంట్ స్టేటస్,కంప్లయింట్ ఫోరం, ఇతర సేవలను వినియోగించుకోవాలని రైతులను కోరారు.

అకాల వర్షాలు వస్తున్నందున మార్కెటింగ్, మార్కెటింగ్ వ్యవసాయ అధికారులు, సీసీఐ అధికారులు అప్రమత్తంగా ఉండి, రైతు తీసుకువచ్చిన పంటలు తడవకుండా కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి కొనుగోళ్ళ విషయములో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రిగారు ఆదేశించారు. ఈ సమావేశంలో అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ మరియు డైరెక్టర్ కొ-ఆపరేటీవ్ ఉదయ్ కుమార్ గారు, కోపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మళ్లీ వర్షాలు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రాగల రెండు, మూడురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాపల్లి, ములుగు, మహమూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఈ నెల 4 వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో మంచిర్యాల, ములుగు, జయశంకర్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డితో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

## ఉమ్మడి పౌరస్మృతి దిశగా అడుగులు


**బలగం టీవీ, హైదరాబాద్**



ఉమ్మడి పౌరస్మృతి దిశగా అడుగులు వేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ దేశ వికాసానికి దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఏటా ఎన్నికల వల్ల దేశ ప్రగతి కుంటుపడుతోందని వ్యాఖ్యానించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని కేవడియాలో ఐక్యతా విగ్రహం వద్ద ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక భాషల అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుందని వెల్లడించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు బయటి, లోపలి శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గత 70 ఏళ్లుగా బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పేరును జపించే వారు దాన్ని చాలా సార్లు అవమానించారని ప్రధాని మోదీ ఆరోపించారు. జమ్ముకశ్మీర్?లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 70ఏళ్ల తర్వాత మొదటిసారిగా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి భారత రాజ్యాంగంపై ప్రమాణం చేశారని పేర్కొన్నారు. ఈ దృశ్యం భారత రాజ్యాంగ నిర్మాతలకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. గతంలో ఉన్న అనేక పన్ను వ్యవస్థలను రద్దు చేసి 'వన్ నేషన్- వన్ ట్యాక్స్ సిస్టమ్' ను తీసుకొచ్చామన్నారు. 'వన్ నేషన్- వన్ హెల్త్ ఇన్సూరెన్స్' సదుపాయాన్ని ప్రవేశపెట్టాం. దీపావళి పండుగ రోజే ఐక్యతా దినోత్సవం పండగను జరుపుకుంటున్నాం. కులాల ప్రాతిపదికన దేశాన్ని విభజించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. దేశ అభివృద్ధి వ్యతిరేకంగా వారు పనిచేస్తున్నారు. నక్సలిజం అడవుల్లో నశించి, అర్బన్‌లో పుట్టుకొస్తోంది. అర్బన్ నక్సల్స్‌ను గుర్తించి వారి ముసుగును తొలగించాలి" అని అన్నారు.

## పక్కా ప్రణాళికలతో సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ పాదయాత్రలు

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ పక్కా ప్రణాళిక ప్రకారం పాదయాత్రలకు సిద్ధమవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ న్నారు. మానకొండూరు నియోజకవర్గం బెజ్జంకిలో ఆయన మీడియా మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళనకు వెచ్చించిన లక్షన్నర కోట్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరు హామీలను అమలు చేయకుండా రాహుల్ గాంధీ కోసం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన జపం చేస్తున్నారని విమర్శించారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చే విధంగా.. నాడు కేసీఆర్ చేసినట్లుగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర చేసే దమ్ముందా అని సవాల్ చేశారు. ప్రధాని మోడీపై యుద్ధం చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అరు గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో తను చేపట్టిన ప్రజా సంగ్రామ పాదయాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఇప్పుడు పాదయాత్ర చేయడం విడ్డూరమన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రావడం లేదని, బీఆర్ఎస్ పరిస్థితి నాయకుడు లేని ఓడలా ఉందని, కేటీఆర్ అహంకార వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, ఏ విషయంలోనూ బీఆర్ఎస్ అగ్రనేతలకు ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ నోటీసులు ఇవ్వలేదన్నారు. దీపావళి ముందు బాంబులు పేలుతాయన్న మంత్రుల మాటల ప్రకారం బాంబులు పేలలేదు ఎద్దేవ చేశారు. ఏమన్నా అంటే కేంద్రం సహకరించడం లేదంటారని దుయ్యబట్టారు.

## పారదర్శకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే..

- సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వేలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి..
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

వివరాలు 3వ పేజీలో

## తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి

- మాజీ మంత్రి కేటీఆర్

వివరాలు 3వ పేజీలో

## లక్ష ఎకరాలకు

# సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- అసంపూర్తి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తాం..
- బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఏ ప్రాజెక్టు చేపట్టలే..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సాగునీటి ప్రాజెక్టుల్లో అసంపూర్తి పనులను పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ నియోజకవర్గం లోని మల్కాపేట రిజర్వాయర్,లచ్చపేట ప్రాజెక్టు,కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి ప్రాజెక్టును ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్,సిఈ సుధాకర్ రెడ్డి,ఈఈ సంతు ప్రకాష్ ,ఈఈ అమరేందర్ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం వేములవాడలో అధికారులతో కలిసి ప్రాజెక్టులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 90 శాతం పనులు పూర్తయి అసంపూర్తిగా ఉన్న 10 శాతం పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

రాష్ట్రంలోని 9 ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన వాటిలో శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యత క్రమంలో చేర్చారని, మల్కాపేట రిజర్వాయర్ కూడా ఉందన్నారు.శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టును 2005 లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ 1737 కోట్లను మంజూరు చేసి ప్రారంభించారన్నారు.2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టుల తప్ప, గత ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు ఏవి చేపట్టలేదని అన్నారు.

2009 మునుపే ఫాజుల్ నగర్ ప్రాజెక్ట్, రుద్రంగి నాగారం చెరువు రిజర్వాయర్, చందుర్తి రిజర్వాయర్ పూర్తి చేసుకుందామని అన్నారు.వేములవాడ నియోజకవర్గంలో 1 లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వినియోగములోకి తెస్తున్నామన్నారు.

90 శాతం పూర్తయిన మలకపేట రిజర్వాయర్ లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ 20 కోట్లు వెచ్చించి 30 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు.

కలికోట సూరమ్మ చెరువు ద్వారా 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, కలికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాలువలకు నిర్మాణానికి భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందని రైతులందరూ సహకరించాలని అన్నారు.గతంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, మర్రిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అనేక ఆందోళన చేశామని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గం పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన వివరాలను మొన్నటి రోజు జలసౌతాలో జరిగిన మీటింగ్లో అధికారులను అడిగి తెలుసుకున్నారు అని అన్నారు .సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట మండలం నర్మాలోని ఎగువ మానేరు నింపేందుకు సింగసముద్రం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి,గ్రావిటీ ద్వారా మలకపేట రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తామని అన్నారు.అనంతరం ఈఎన్సి అనిల్ కుమార్ మాట్లాడుతూ

నీటి లభ్యత ఉండి టెక్నికల్ ఫీజుబిలిటీ బడ్జెట్ ప్రకారం ప్రాధాన్యత క్రమంలోని ప్రాజెక్టులను పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయన్నారు.

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తవమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రాజెక్టులను సందర్శిస్తున్నమని అన్నారు . రాష్ట్రంలోని పంప్ హౌస్ ల పైన నేడు రంగనాయక సాగర్ లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆధికారులు,నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు..








## సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడూర్, బద్దెనపల్లి లో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్యూమరేటర్ బ్లాక్ చేపడుతున్న సర్వేను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసిల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## పంజాబ్ సాహిత్యంలోకి పెద్దింటి నవల..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

తెలంగాణ మాండలికం వాడుతూనే తెలంగాణా కథని సరిహద్దులు దాటించిన ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ . పెద్దింటి అశోక్ కుమార్ రాసిన జిగిరి నవల పంజాబ్ సాహిత్యం లోకి వెళ్ళింది. ప్రముఖ పంజాబీ రచయిత తారసేన్ మీటూ జిగిరి నవలను పంజాబీ లోకి అనువదించగా ప్రముఖ ఢిల్లీ పబ్లిషర్స్ నవయుగ పబ్లికేషన్స్ దీపావళి కానుకగా ప్రచురించింది . ఈ నవల పంజాబీ లోకి అనువాదం కావడం ఇది రెండవసారి. గతం లో మన్మోహన్ సింగ్ ఈ నవలను పంజాబీ లోకి అనువదించగా ప్రముఖ పత్రిక పంజాబ్ కహానిలో అచ్చయింది. జిగిరి నవల ఇప్పటికి 12 భారతీయ భాషల్లోకి అనువాదమయింది. ప్రముఖ చిత్ర సంస్థ జిగిరి నవలను పాన్ ఇండియా సినిమాగా నిర్మిస్తుంది. కథలు, నవలలతో పాటు సినిమాలకి కూడా మాటలు పాటలు రాస్తున్న పెద్దింటి రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆసిరెడ్డి పల్లెలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

## హౌస్ లిస్టింగ్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



- జిల్లా వ్యాప్తంగా మొదలైన సర్వే
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , వేములవాడ :**

హౌస్ లిస్టింగ్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మొదలుకాగా, శుక్రవారం బోయినపల్లి మండల కేంద్రములోని 11 వ వార్డు, అలాగే వేములవాడ అర్బన్ మండలం మారుపాక, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లిలో చేపట్టిన సర్వేను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమారేటర్ బ్లాక్ లోని ఐదు ఇండ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న విధానంపై అధికారాలను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా తేదీ 01.11.2024 నుండి 03.11.2024 వరకు హౌస్ లిస్టింగ్ సేకరిస్తారని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు జయశీల, రాజీవ్ మల్హోత్రా, ఎంపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల పట్ల అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలి




- ఎంఈఓ కృష్ణ హరి

**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు గత నెలలో జరిగిన రంగోత్సవ్ పోటీలల్లో జాతీయస్థాయిలో 213 మంది ఎంపికై ప్రభంజనం సృష్టించి శుక్రవారం అవార్డులు సొంతం చేసుకున్నారు.రంగోత్సవ్లో రాణించిన విద్యార్థులకు మండల విద్యాధికారి కృష్ణహరి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రౌంజ్ మెడల్, శిల్డ్, మెమోంటో, ప్రశంసపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కృష్ణహరి మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలను అందిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా పదవ తరగతిలో విద్యార్థులు మంచి జిపిఏ సాధించి తల్లి, తండ్రి, గురువుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కె. సాయినమస్యకు ట్రోఫి, సైకిల్, బండి బ్లెస్సీ కు స్టడీ ల్యాంప్, అరిబా తస్కిన్, కె. రేషిక, హరిణి, అనిరుద్, పూజ, సంహిత్, ఏంజెల్, నిహాల్, వర్షిణి, మాలవికలకు గోల్డ్ మెడల్, ట్రోఫిలను మండల విద్యాధికారి అందించారు. అనంతరం కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ మాట్లాడుతూ రంగోత్సవ్ కార్యక్రమంలో తమ పాఠశాల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 213 మంది జాతీయస్థాయిలో రెండవ దశకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ యండి లతీఫ్ తెలిపారు. గత సంవత్సరం కూడా రంగోత్సవ్లో తమ విద్యార్థులు ఉ త్తమ ఫలితాలను సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్ కుమార్, సంతోష్ కుమార్, డైరెక్టర్లు నయిమా, అశ్రఫ్, హామిద, మిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిన వేణుగోపాలస్వామి ఆలయ రథం..

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గల వేణుగోపాలస్వామి గుడి సేవ వాహనం (చిన్న రథం) గత సంవత్సరం నుండి నిర్లక్ష్యానికి గురైనా పట్టించుకోవడం లేదు అని భక్తులు తెలిపారు. ఆలయ కమిటీలు ఉన్నప్పటికీ కూడా నిర్లక్ష్యం వైఖరితో బ్రహ్మోత్సవాలకు ఉపయోగించే రథాలను ఎండకు ఎండి వానకు నాని కొన్ని భాగాలు విరిగి పోగా సేవ రథం గీరలు చెదలు పట్టి పనికి రాకుండా పోతున్నాయి.

తాము బ్రహ్మాండంగా పండగలు చేస్తున్నాం అనే వారికి స్వామి వారి వాహనాల మీద ఇంత నిర్లక్ష్యం ఎందుకు.దసరా పండగ 10 రోజుల ముందు సేవ వాహనం హైస్కూల్ వద్ద ఉన్న రథశాల నుండి తెచ్చి గ్రామపంచాయతి లో పెడితే నాలుగు రోజులలో ముందు చక్రాలు చెదలు వస్తె ఓ భక్తుడు అది గమనించి పక్కకు జరిపి పెట్టారు.బాలాలయంలో పూజా కార్యక్రమాల విధానం పెద్ద పంతులు శాస్త్రంలో చెప్పినట్టు చేసి శాస్త్ర ప్రకారం కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని, గ్రామ ప్రజలు కోరుతున్నారు.ఇకనైనా స్వామివారి వాహనాలను రిపేర్ చేసి ఉపయోగములకు తీసుకురావాలని, నూతనంగా ఆలయం నిర్మాణం చేపట్టిన తర్వాత కొత్త వాహనాలు చేపించవచ్చు కానీ అంతవరకు ఉన్న వాహనాలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.



## కురుమూర్తి జాతరకు స్పెషల్ బస్సులు

**బలగం టీవీ,హైదరాబాద్**

కురుమూర్తి స్వామి జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి ఈ స్పెషల్ బస్సులు నడవనున్నాయి. కురుమూర్తి జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం ఈ నెల 8వ తేదీన ఉంది. దీంతో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను టీజీఎస్ఆర్టీసీ అందుబాటులో ఉంచుతుంది. ఎంజీబీఎస్ -ఆరాంఘర్ - మహబూబ్‌నగర్ మీదుగా ఈ బస్సులు జాతరకు వెళ్తాయి.కురుమూర్తి జాతరకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో టీజీఎస్ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్లను కల్పిస్తోంది. టికెట్ల బుకింగ్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్ సంప్రదించగలరు. ఈ ప్రత్యేక బస్సులను ఉపయోగించుకుని కురుమూర్తి స్వామిని దర్శించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కోరుతోంది.

## రాష్ట్ర స్థాయి పోటీలకు రైసింగ్ అకాడమీ క్రీడాకారిణి ఎంపిక..

**బలగం టీవీ, సిరిసిల్ల :**

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లా లోని రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారిణి కే.జిగిష ఎంపికైంది. 29న కరీంనగర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీ లు కొత్తపల్లి లోని అకాడమీక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించగా అత్యంత ప్రతిభ కనబరిచిన జిగిష రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకుఎంపికైంది.రాజన్న సిరిసిల్ల లో శ్రీ కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ లో 8వ తరుగతి చదువుతున్న కే.జిగిష ఉదయం, సాయంత్రం వేళలో రైసింగ్ అకాడమీ లో హ్యాండ్ బాల్ శిక్షణ పొందుతూ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీ లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు అని, ఈ నెల 2 నుండి 4 వరకు ఆసిఫాబాద్ జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో కే.జిగిష పాల్గొంటారని అకాడమీ హ్యాండ్ బాల్ కోచ్ కృష్ణ హరి తెలిపారు.శ్రీ కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజు రెడ్డి మాట్లాడుతూ క్రీడలు పిల్లల జీవితాలలో ప్రాధాన పాత్ర పోషిస్తాయని, పిల్లలకి ప్లేగ్రౌండ్ కు అలవాటు చేయడం ఎంతో మంచిది అని,ఆరోగ్యకరంగా పిల్లలు ఎదగాలని అనుకుంటే కచ్చితంగా పిల్లలకు క్రీడలను అలవాటు చేయాలని అన్నారు.పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా




ఎదిగేందుకు స్పోర్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు.ఈ కార్యక్రమం లో స్కూల్ పీ ఈ టి లు బాబు, నవీన్, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు...

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి..



- ఫ్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్

**బలగం టీవీ,తంగళ్ళపల్లి:**

తంగళ్ళపల్లి మండలంలో వెంటనే వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఫ్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్ అన్నారు.మండలంలోని గండిలచ్చపేట,ఓబులాపూర్ పలు గ్రామాలలో సెంటర్లు ఓపెన్ అయి కూడా కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్ట లేదన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ధాన్యం తూకం వేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికే సగం కు పైగా దళారులకు తక్కువ రేటుకు రైతులంతా రైస్ మిల్లులోకి ధాన్యమును అమ్మేశారన్నారు. వెంటనే కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్**

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు నిందితులను డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. బ్యాంకాక్ నుంచి విమానంలో వచ్చిన ఇద్దరు నిందితులను తెల్లవారుజామున డీఆర్ఐ అధికారులు తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో కెల్లాస్ ఫ్యాకెట్లు లభించాయి. వాటిని పరీక్షించగా డ్రగ్స్‌తో కలిసి ఉన్నట్టు గుర్తించారు. ఆ ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. వారి వద్ద లభించిన 13 ప్యాకెట్లు 7.096 కిలోల బరువు ఉన్నట్టు తెలిపారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.7 కోట్ల వరకు ఉం టుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రజలను నమ్మించి.. నయవంచన చేసినందుకు కాంగ్రెస్ పార్టీ నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బడ్జెట్ చూసుకుని గ్యారంటీలు ప్రకటించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గాలిమాటల గ్యారెంటీలిస్తే.. మొదటికే మోసం వస్తుందని ఇప్పుడు అర్థమైందా అని విమర్శించారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ప్రకటించినప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ గుర్తు రాలేదా అని ప్రశ్నించారు బడ్జెట్ చూసుకోకుండా హామీలిస్తే.. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తప్పదని ఇప్పుడు బోధపడిందా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలతో వల వేసినప్పుడు తెలంగాణ బడ్జెట్ గురించి తెలియదా అని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఈ తప్పు చేస్తున్నప్పుడు.. ఈ విషయాలు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. ఏవీ చూసుకోకుండా.. కేవలం అధికారమే లక్ష్యంగా.. కాంగ్రెస్ ఆడిన గ్యారెంటీల గారడీతో.. తెలంగాణ రాష్ట్రం.. ఏడాదిలోనే ఆగమైందని విమర్శించారు.

తెలంగాణ ప్రజలను నమ్మించి.. నయవంచన చేసినందుకు కాంగ్రెస్ పార్టీ నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో పరుగులు పెడుతున్న తెలంగాణను అడ్డగోలు హామీలతో మభ్యపెట్టినందుకు తప్పు ఒప్పుకోవాలన్నారు. అనాలోచితంగా ఇచ్చే కాంగ్రెస్ గ్యారెంటీలతో.. భవిష్యత్ తరాలకు కూడా నష్టం జరుగుతుందని ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషమని అన్నారు. కానీ.. కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మిన పాపానికి.. ఏడాదికాలంగా తెలంగాణకు జరిగిన నష్టం పూడ్చలేనిదని వ్యాఖ్యానించారు. గ్యారెంటీల మాటున కాంగ్రెస్ చేసిన మోసం క్షమించలేనిదని స్పష్టం చేశారు.

# కులగణన సర్వేకు సహకరించాలి

- **బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **తెలంగాణ ప్రజలకు లేఖ**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గణన పై రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ప్రజలకు లేఖ రాశారు.

"10 నవంబర్ 2023 రోజున రాహుల్ గాంధీ గారి మాట ప్రకారము కర్నాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్య గారి సమక్షంలో కామారెడ్డి బహిరంగ సభలో తెలంగాణ కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తేది. 4 ఫిబ్రవరి 2024 రోజున జరిగిన మంత్రి మండలి నిర్ణయము మేరకు మొత్తము తెలంగాణ రాష్ట్రములో ఇంటింటికి సమగ్ర సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది, రాజకీయ మరియు కులాల సర్వే (కుల గణన)) చేపట్టాలని ఈ క్యాబినెట్ తీర్మానించింది.



రాష్టములో వెనుకబడిన తరగతుల, ఎస్‌సి అండ్ ఎస్‌టి పౌరులు మరియు రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది రాజకీయ అవకాశాలను ప్లాన్ చేసి అమలు చేయడానికి గాను తేది. 16 ఫిబ్రవరి 2024 రోజున శాసన సభలో ఏకగ్రీవంగా తీర్మానించడమైనది.

ఇట్టి తీర్మానమునకు అనుగుణముగా జి.ఓ.ఎంయెస్. నెం. 26, తేది. 15.3.2024 ప్రకారము కుల గణన చేయుటకు గాను తెలంగాణ బి.సి. కమీషన్ యొక్క తీర్మానము క్రమము బి.సి. సంక్షేమ శాఖ ద్వారా 150 కోట్ల రూపాయలను విడుదల చేయడము ప్రక్రియ ప్రారంభము జరిగింది.

కులగణన చేయుటకు గాను జి.ఓ.ఎంయెస్. నెం. 199, తేది. 06.09. 2024 రోజున నిరంజన్ ఛైర్మన్ గా మరియు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి గార్లను మెంబర్స్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయటము జరిగినది.

తెలంగాణ రాష్ట్రములో ఇంటింటికి సమగ్ర సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాడి, రాజకీయ మరియు కులాల సర్వే) కులగణన చేయుటకు గాను జి.ఓ.ఎంయెస్. నెం. 18, తేది. 10.10.2024 ద్వారా ప్లానింగ్ డిపార్ట్ మెంట్ ను నోడల్ డిపార్ట్ మెంట్ గా ప్రకటిస్తూ తెలం గాణ ప్రభుత్వము ఉత్తర్వులు జారీచేయడమైనది.

తేది: 6.11.2024 నుండి 85,000 మంది ఎన్యూమరేటర్లు ప్రతి 10 మంది ఏనుమరేటర్లకు ఒక పరిశీలకుడుగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్టాఈ అధికారుల పర్యవేక్షణలో ప్రతి ఇంటికి సమగ్ర సమాచార సేకరణ చేసి డాటా ఎంట్రీ చేయడముతో పాటుగా 30 నవంబర్ లోపు ఈయొక్క సమాచార సేకరణ పూర్తి చేయాలని ప్రణాళి కలతో ముందుకు సాగుతున్న ఈ కార్యక్రమము నకు ప్రజలందరూ సహకరించాలని కోరుతున్నాను. దేశములో తొలిసారిగా మరియు రాష్ట్రములో రాహుల్ గాంధీ గారి మాట ప్రకారము జరుగుతున్న ఈ సర్వేను ఈ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఈ సర్వే రాబోయే కాలములో అన్ని రకాల పథకాలు అందుటకు మరియు ఇది ఒక మెగా హెల్త్ చెకప్ లాగా సమాచారముతో పాటుగా భవిష్యత్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఉపయోగపడుతుంది కావునా తప్పకుండా ప్రతి ఒక్కరూ సమాచారము సేకరిస్తున్న వారు మరియు సమాచారము తెలుపుతున్న ప్రతి తెలంగాణ బిడ్డ ఈ యొక్క సర్వే లో భాగస్వాములై సహరించాలని కోరుతున్నాను.

# పారదర్శకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే..




- **సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వేలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి..**
- **బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

కర్ణాటక లో చేపట్టిన సర్వే వివరాలు 10 సంవత్సరాలు గడిచిన బయట పెట్టలేదని , తెలంగాణలో మాత్రం పారదర్శకంగా సర్వే చేపడుతున్నామని,రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనే విజయవంతం చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు.

శుక్రవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ కమిషనర్ బాల మాయ దేవితో కలిసి కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సమగ్ర కులాల స్థితిగతుల పై ప్రజాభి ప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాజన్న సిరిసి ల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఉదయం గెస్ట్ హౌస్ లో బీసీ కమిషన్ చైర్ పర్సన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 53 మంది వివిధ సంఘాల ప్రతినిధులు సమగ్ర కులాల స్థితిగతులపై తమ అభిప్రాయాన్ని తెలియజేసి నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ ఆఫిడవిట్ లను ఆరు సెట్లు సమర్పించారు.

అభిప్రాయాల సేకరణ కార్యక్రమం అనంతరం బీసి కమిషన్ చైర్మన్ నిరంజన్ పాత్రికేయులతో మాట్లాడుతూ బృహత్తరమైన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, సమగ్రంగా అన్ని కులాల వారు ఎంతమంది, ఏ స్థితిగ తులలో ఉన్నారో తెలుసుకుంటుందని అన్నారు. బీసీలకే పరిమితం కాకుండా ఓసిలు, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, సంచార జాతుల ఆర్థిక సామాజిక పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేపట్టామని అన్నారు.

బీసీ కమిషన్ ఎవరి ఒత్తిడులకు గురి కాకుండా ఉన్నది ఉన్నట్లు నివేదిక రూపొందించి సమర్పిస్తామని అన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అభిప్రాయాలు తెలియజేసిన వారు క్షేత్రస్థాయిలో జరిగే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొని ఎన్యుమరేటర్లకు వివరాలు తెలియజేయాలని అన్నారు.

జనాభాలో ఆయా వర్గాల జనాభా శాతం నిర్ధారించే బాధ్యత వారి పైనే ఉంటుందని, త్వరలో ప్రారంభమయ్యే ఇంటింటి సర్వే లో ప్రజలు పాల్గొని వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఈ విషయాన్ని ఏ కుల సంఘం విస్మరించరాదని అన్నారు. రాజకీయ పార్టీల విధి విధానాలు వేరైనప్పటికీ ఈ కార్యక్రమంలో ఆటంకాలు,అపోహలు సృష్టించే ప్రయత్నం చేయవద్దని అన్నారు.

ముఖ్యమంత్రితో సమావేశమై దీనిపై చర్చించిన సమయంలో అడ్వకేట్ జనరల్ సైతం పాల్గొన్నారని, ప్రస్తుతం తాము ఒక పార్టీకి చెందిన వారం కాదని అన్నారు.

కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని,న్యాయ నిపుణుల సలహాల మేరకు బీసీ కమిషన్ కార్యక్రమాలు యాథా విధిగా కొనసాగు తాయని అన్నారు.ఉదయం నుంచి అనేక మంది ప్రతినిధులు వారి విజ్ఞప్తి తెలియజేశారని, కులాల స్థితిగతుల గురించి కమిషన్ దృష్టికి తీసుకుని వచ్చారని అన్నారు.

బీసీ కమిషన్ ఆహ్వానం మేరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న 4 జిల్లాల కలెక్టర్లకు కమిషన్ కృతజ్ఞతలుతెలిపారు. ప్రజల గోడు కలెక్టర్లు నేరుగా తెలుసుకోవడం మంచిదని, సమాజంలో ఉన్న అనేక కులాల గురించి మనకు తెలియదని, ఇటువంటి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అన్నారు.

బీసి కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రజా ప్రతినిధులు రవీందర్ సింగ్, చెల్లా స్వరూప, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతిక మొదలగు ప్రజా ప్రతినిధులు గెస్ట్ హౌస్ కు వచ్చి తమను కలిసి అభిప్రాయాలు తెలియ జేశారని అన్నారు.

బిసి కుల గణన తెరమీదకి వచ్చిన తరువాత బీసీ కులాలే కాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓసీలలోని అన్ని కులాలకు సంబంధించి లెక్కలు తేలాలని సర్వే జరుగుతుందని, అందులో భాగంగా బీసీ కమిషన్ సంబంధించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ గురించి వచ్చినప్పటికీ ప్రజల స్థితిగతుల గురించి అందించిన అభిప్రాయాలను నోట్ చేసుకోవడం జరిగిందని అన్నారు.

కులాలకు సంబంధించిన జనాభా, జీవన స్థితిగతుల వివరాలను రాబోయే 3,4 రోజులలో ప్రారంభమయ్యే కులాల సర్వేలో స్పష్టంగా అందజేయాలని సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలు, డిమాండ్స్ నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో క్రియాశీలకంగా పాల్గొనాలని, ఎన్యుమరేటర్లకు సహకరించి సమగ్ర సమాచారం అందించాలనిఅన్నారు .ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి , బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసక్తికరంగా మూడో టెస్టు

- బంతితో మెరిసిన భారత్
- బ్యాటింగ్‌లో తడబాటు
- తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 235, భారత్ 86- 4.





**బలగం టీవీ, ముంబై**

వాంఖడేలో జరుగుతున్న భారత్- న్యూజిలాండ్ మూడో టెస్టు ఆసక్తికరంగా మారుతోంది. తొలి రోజు రవీంద్ర జడేజా (5/65), వాషింగ్టన్ సుందర్(4/81)లు తిప్పేయడంతో న్యూజిలాండ్‌ను 235 పరుగులకే ఆలౌట్ చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడింది. తొలి రోజు ఆట ముగిసేసరికి టీమ్‌ఇండియా మొదటి ఇన్నింగ్స్‌లో ప్రస్తుతం భారత్ స్కోర్ 86- 4గా ఉంది. ఇంకా భారత్ 149 పరుగుల వెనకంజలో ఉంది. క్రీజులో రిషభ్ పంత్ (1 పరుగు), శుభ్‌మన్ గిల్ (31 పరుగులు) ఉన్నారు. కివీస్ బౌలర్లలో అజాజ్ పటేల్ 2, మ్యాట్ హెన్రీ 1 వికెట్ దక్కించుకున్నారు.

ముందు బ్యాటింగ్ చేసిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకు ఆలౌటైంది. స్పిన్‌కు అనుకూలించిన ముంబయి వాంఖడే పిచ్‌పై భారత బౌలర్లు చెలరేగిపోయారు. స్టార్ బ్యాటర్ విల్ యంగ్ (71 పరుగులు), డారిల్ మిచెల్ (82 పరుగులు) ఇద్దరే హాఫ్ సెంచరీలతో రాణించారు. ఓపెనర్ టామ్ లేథమ్ (28 పరుగులు), డేవన్ కాన్వే (4 పరుగులు), రచిన్ రవీంద్ర (5 పరుగులు), టామ్ బ్లండెల్ (0), గ్లెన్ ఫిలిప్స్ (17 పరుగులు) స్వల్ప స్కోర్లకే ఔటయ్యారు. రవీంద్ర జడేజా 5, వాషింగ్టన్ సుందర్ 4, ఆకాశ్ దీప్ 1 వికెట్లు దక్కించుకున్నారు.

భారత్‌కు మరోసారి పేలవ ఆరంభం దక్కింది.కెప్టెన్ రోహిత్ శర్మ (18) ధాటిగా ఇన్నింగ్స్ మొదలెట్టినా మ్యాట్ హెన్రీకి దొరికిపోయాడు. అయినా శుభ్‌మన్ గిల్(30 నాటౌట్) జతగా యశస్వీ జైస్వాల్(30) దంచాడు. స్వీప్ షాట్లతో అజాజ్ పటేల్‌పై పైచేయి సాధించిన యశస్వీ చివరకు అలాంటి షాట్ ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 78 పరుగుల వద్ద భారత్ రెండో వికెట్ కోల్పోయింది. తర్వాత బంతికే మహ్మద్ సిరాజ్ (0) కూడా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (4 పరుగులు) కూడా మరోసారి నిరాశ పర్చాడు. లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌట్ అయ్యాడు. దీంతో భారత్ 84- 4కు చేరింది. 9 బంతుల వ్యవధిలో టీమ్‌ఇండియా 3 వికెట్లు చేజార్చుకోవడం గమనార్హం. ఇక రెండో రోజు భారత్ బ్యాటింగ్ చేసి లీడ్‌లోకి వెళ్తారో లేదా తర్వగా చాపచుట్టేస్తారో వేచి చూడాలి.





# రూ. క్లాసెన్‌కు 23 కోట్లు

**ఐపీఎల్‌లో రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల లిస్టులను ప్రకటించిన ఆయా జట్లు**
**అత్యధిక ధర క్లాసెన్‌కు.. ఆ తర్వాత కోహ్లీనే..**

**బలగం టీవీ, హైదరాబాద్**




2025 ఐపీఎల్‌కు గాను అన్ని ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకున్న ప్లేయర్ల లిస్ట్‌ను బోర్డుకు సమర్పించాయి. ఇందులో హెన్రిచ్ క్లాసెన్ రికార్డు ధర పలికాడు. అతడిని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా 23 కోట్లకు అట్టిపెట్టుకుంది. ఇక స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ ముంబయితోనే ఉండగా, విరాట్ ఆర్సీబీతో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లీని(రూ.21 కోట్లు)కు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది. ఇక చెన్నై ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రిటైన్ చేసుకుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా 23 కోట్లకు క్లాసెన్‌ను అట్టిపెట్టుకోగా ఇక ప్యాట్ కమిన్స్, ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మతో పాటు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిలను టీమ్ రిటైన్ చేసుకుం ది.క్లాసెన్‌కు రూ. 23 కోట్లు, కమిన్స్‌కు రూ. 18 కోట్లు ఆఫర్ చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్‌లకు తలా రూ.14 కోట్లు.. నితీశ్‌కు రూ.6 కోట్లు ఇచ్చేందుకు ఆరెంజ్ ఆర్మీ సిద్ధమైంది.

ముంబై ఇండియన్స్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా... చెన్నై సూపర్ కింగ్స్ రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, శివం దూబే, ఎంఎస్ ధోనీ, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విరాట్ కోహ్లీ (రూ.21 కోట్లు), రజత్ పాటిదార్, యశ్ దయాల్‌లను అట్టిపెట్టుకున్నాయి.

మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ నలుగురు భారత ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. కెప్టెన్ శాంసన్, యశస్వీలకు రూ. 18 కోట్లు ఇచ్చేందుకు ఓకే చెప్పింది.కోల్‌కతా నైట్ రైడర్స్ రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, ఆండ్రూ రస్సెల్, సునీల్ నరైన్, రమన్‌దీప్ సింగ్, హర్షిత్ రానా... ఢిల్లీ క్యాపిటల్స్ అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పొరెల్‌లను,

గుజరాత్ టైటాన్స్ రషీద్ ఖాన్, శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, రాహుల్ తెవా టియా, షారుక్ ఖాన్‌లను అట్టిపెట్టుకున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ నికోలస్ పూరన్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, అయుశ్ బదొని, మొహ్సిన్ ఖాన్ పంజాబ్ కింగ్స్ శశాంక్ సింగ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌లను అట్టిపెట్టుకున్నాయి.

కాగా శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా) , రిషభ్ పంత్ (ఢిల్లీ), శిఖర్ ధావన్ (పంజాబ్), ఫాఫ్ డుప్లెసిస్ (ఆర్సీబీ), కేఎల్ రాహుల్ (లఖ్‌నవూ) ఐదుగురు కెప్టెన్లు మెగా వేలంలో ఉండనున్నారు.

మొత్తం 10 జట్లు 46 మంది ప్లేయర్లను అట్టిపెట్టుకున్నాయి. అందులో కోల్‌కతా, రాజస్థాన్ జట్లు గరిష్ఠంగా ఆరు రిటెన్షన్‌ల పూర్తి కోటాను ఉపయోగించుకున్నాయి. పంజాబ్ జట్టు తక్కువ సంఖ్యలో ఇద్దరిని మాత్రమే అట్టిపెట్టుకుంది. దీంతో పంజాబ్ వద్ద అన్ని జట్ట కంటే అత్యధికంగా రూ. 110.50 కోట్లు ఉన్నాయి. ఇక ఐదుగురు క్యాప్డ్ ప్లేయర్లు సహా ఆరుగురిని రిటైన్ చేసుకున్న రాజస్థాన్ రాయల్స్ రూ.41 కోట్ల అతి తక్కువ పర్స్‌తో వేలంలోకి దిగనుంది.




# సంక్రాంతికి వస్తున్నాం..

**వెంకటేశ్, అనిల్ రావిపూడి మూవీ పేరు, ఫస్ట్‌లుక్ రివీల్**


**బలగం టీవీ, హైదరాబాద్**

విక్టరీ వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న క్రేజీ మూవీ పేరును మేకర్స్ అనౌన్స్ చేశారు.సినిమాకు 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌ని ఖరారు చేశారు. అలాగే ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ లుంగీ ధరించి.. గంభీరమైన భంగిమలో, స్పోర్టింగ్ షేడ్స్, తుపాకీ పట్టుకుని.. ఐశ్వర్య రాజేశ్ చీరలో.. మీనాక్షి చౌదరి మోడ్రన్ అవతార్‌లో కనిపించారు. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ప్రియురాలిగా నటిస్తున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో షూటింగ్ జరుగుతున్నది. పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ట్రయాగింల్ క్రైమ్ డ్రామాని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు.మూవీ డబ్బింగ్ పనులు మొదలవ్వగా.. షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా.. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జీ ఆదినారాయణ అందించగా, వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

# 'స్పిరిట్' మ్యూజిక్ పనులు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

: రెబల్ స్టార్ ప్రభాస్- స్టార్ డైరెక్టర్ సందీప్ వంగా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న మూవీ 'స్పిరిట్'. డిసెంబర్ చివర్లో లేదా వచ్చే ఏడాది నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని చిత్ర బృందం ప్రకటించింది. అయితే దీపావళి సందర్భంగా సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. 'స్పిరిట్' సినిమాకు సంబంధించి మ్యూజిక్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ వెల్లడించారు. ఆయన మ్యూజిక్ కంపోజ్ చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. అందులో హర్షవర్ధన్, సందీప్ ట్యూన్స్ ఎంజాయ్ చేస్తూ కనిపించారు.




**టాలీవుడ్‌లో తెరకెక్కిన లేటెస్ట్ చిత్రాల్లో 'మట్కా' ఒకటి. ఈ సినిమాతో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ వైవిధ్యమైన గెటప్స్‌లో నటిస్తుండటంతో ఈ సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా నుండి ఇప్పుడు మరో అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను శనివారం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా లాంచ్ చేయనున్నారు. ఈ ట్రైలర్ మధ్యాహ్నం 12.06 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని చిత్ర యూనిట్ తాజాగా వెల్లడించింది. ఈ సినిమాను దర్శకుడు కరుణ కుమార్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా జివి.ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నాడు.**